ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 5జనవరి 2024





# మునిసిపాలిటీలో ముసలం

| |
|---|
| చైర్‌పర్సన్(బీఆర్‌ఎస్)పై అసంతృప్తి |
| అవిశ్వాసం దిశగా వర్ధన్నపేట కౌన్సిలర్లు |
| వైస్‌చైర్మన్ కోసం కాంగ్రెస్ పావులు |
| నేడో, రేపో అవిశ్వాసం నోటీసు? |
| చక్రం తిప్పుతున్న ప్రముఖ సీనియర్ న్యాయవాది |
| కౌన్సిలర్‌కు తలా రూ. 2లక్షల ఆఫర్? |

వరంగల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మునిసిపల్ పీఠంపై కాంగ్రెస్ కన్ను పడిందా..! అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు ప్రస్తుతం ఉన్న వర్ధన్నపేట మునిసిపాలిటీ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ(బీఆర్‌ఎస్)ను తప్పించి మరో వ్యక్తిని చైర్మన్‌గా చేయాలని కౌన్సిలర్లు నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు బుధవారం పలువురు కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు హన్మకొండకు వెళ్లగా, చివరి నిమిషంలో అనివార్య కారణాలతో రద్దయింది. బీఆర్‌ఎస్‌లో అసమ్మతి సెగలు కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తున్నట్లుగా ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో చైర్మన్ పదవి బీఆర్‌ఎస్‌కు ఇచ్చేసి, వైస్‌చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నుంచి ఓ కౌన్సిలర్‌కు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు సమాచారం. దీంతో మరో 10నెలల్లో జరిగే మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి స్థాయిలో పట్టు సాధించేలా పావులు కదుపుతోంది.

## కౌన్సిలర్‌కు రూ. 2 లక్షలు?

అవిశ్వాసం నోటీసుపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన కౌన్సిలర్లు ఓ ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు చైర్మన్‌గా పోటీ చేసే వ్యక్తి తనకు ఓటు వేసే కౌన్సిలర్లకు రూ. 2లక్షలు ఆఫర్ చేశాడట..? అందులో ఇప్పటికే ఓ ఆరుగురు కౌన్సిలర్లకు తలా రూ.లక్ష ముట్టచెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నిక పూర్తయిన తర్వాత మిగతా అమౌంట్ ఇచ్చేందుకు అంగీకారం చేసుకున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ పీఠంపై కూర్చోవాలనుకునే వారికి 8 మంది కౌన్సిలర్లు కావాలి. వర్ధన్నపేటలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందులో బీఆర్‌ఎస్‌కు 9, కాంగ్రెస్ 2, బీజేపీ 1 కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో చైర్మన్ అయ్యే వారికి ఒకరు బలపరచడం, మరొకరు సూచించడం చేయగా, మరో ఆరుగురు మద్దతు పలికితే సరిపోతుంది. దీంతో వైస్ చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీకి ఇస్తే ఇద్దరు కౌన్సిలర్లు మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉండగా, బీజేపీ నుంచి సైతం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## బీఆర్‌ఎస్‌లో అసమ్మతి..

బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ల మధ్య అసమ్మతి రాగమే అవిశ్వాసం నోటీసుకు దారి తీసిందని చర్చ జరుగుతోంది. చైర్మన్ ఒంటెద్దు పోకడ, పెత్తనం చైర్మన్ తండ్రిది కావడంతో మిగతా కౌన్సిలర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల ముందు నుంచే ఈ అంతర్గత గొడవలు జరుగుతుండగా, బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో దీనిని ప్రస్తుతం తెరమీదకు తీసుకువచ్చారు. సొంత పార్టీ నాయకులైన ఓ నలుగురు కలిసి ఈ తతంగమంతా నడుపుతున్నట్లుగా పట్టణంలో చర్చ జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు ఈ వ్యవహారంపై నిశితంగా గమనిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వీరి వద్దకు వెళ్లి వచ్చారు. అయితే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్మన్ ఉండడం ఇష్టం లేదని, మాకు ఇష్టం లేకుండా ఉంటే మేమే వేరే పార్టీలోకి వెళ్తామని తేల్చి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుత చైర్మన్ తప్ప మరెవరినైనా చైర్మన్ చేస్తే మాకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడంతో అధిష్ఠానం ఆలోచిస్తోందని చెపుతున్నారు.

## చక్రం తిప్పుతున్న ప్రముఖ న్యాయవాది

వర్ధన్నపేట మునిసిపాలిటీలో కాంగ్రెస్ పట్టు సాధించే విషయంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది చక్రం తిప్పుతున్నాడు. పక్క మండలానికి చెందిన ఆయన వర్ధన్నపేట మండల ప్రజలకు సుపరిచితుడు కాగా, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేసిన అనుభవం ఉంది. దీంతో భవిష్యత్తులో పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు మునిసిపాలిటీ అవిశ్వాస తీర్మానాన్ని తెరమీదకు తీసుకువచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా కేఆర్ నాగరాజు నామినేషన్ వేసిన నాటి నుంచి సీనియర్ న్యాయవాది ఎల్లప్పుడు వెన్నంటే ఉంటూ తెరవెనుక రాజకీయాలను నడుపుతున్నాడు. తనకు అన్ని పార్టీల నుంచి వివిధ హోదాల్లో ఉన్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల పరిచయాలు ఉండడంతో కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చిందని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో రెండు మండలాల నుంచి మెజారిటీ ఓట్లు కేఆర్ నాగరాజుకు పడినట్లుగా తెలుస్తోంది. భవిష్యత్తు రాజకీయాలపై దృష్టి పెట్టిన ఆయన ఎంత వరకు సక్సెస్ అవుతారో చూడాలి.

### నేడో, రేపో అవిశ్వాసం?

వర్ధన్నపేట మునిసిపాలిటీ చైర్మన్ ఆంగోతు అరుణపై నేడో రేపో అవిశ్వాసం నోటీసు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బుధవారం బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలెక్టర్‌కు ఇద్దామని వెళ్లినా చివరి నిమిషంలో వాయిదా పడింది. అయితే అవిశ్వాసం నోటీసు ఇవ్వడం మాత్రం వాయిదా పడిందని, నిర్ణయాన్ని మాత్రం మార్చుకోలేదని కొందరు కౌన్సిలర్లు బహిరంగంగా చెపుతున్నారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ డైలామాలో పడింది. పూర్తిస్థాయిలో మెజారిటీ ఉన్నప్పటికీ అవిశ్వాసం నోటీసు అందిస్తున్న విషయాన్ని తెలుసుకుని జాగ్రత్తచర్యలు చేపట్టింది. పార్టీ కౌన్సిలర్లు చేజారకుండా అధిష్ఠానం వద్దకు క్యూ కట్టడం ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ, మునిసిపల్ కమిషనర్

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి..

- పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి..
- అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య
- బాధ్యతాయుతంగా వ్యవహరించాలి : సీపీ

వరంగల్ కలెక్టరేట్, జనవరి 4: రానున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, రిటర్నింగ్ అధికారులు, కమి షనర్ షేక్ రిజ్వాన్ బాషా, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నర్సంపేట ఆర్‌డీవో కృష్ణవేణి, డీసీపీ రవీందర్‌లతో కలిసి అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోజరిగే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుటకు నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆదేశించారు. గతంలో గుర్తించిన కేంద్రాలను నివేది కల ఆధారంగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజక వర్గాల పరిధి లోని ఆయా పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదికలు తయారు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించాలని కేంద్రాల వద్ద అదనపు సాయుధ బలగాలను సేకరించుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ కోరారు.

పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకున్నామని, ఆదే స్పూర్తితో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ జరిగేలా కృషి చేయాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ముందస్తుగా నివేదికలు తయారు చేసి ఎన్నికల కమిషనర్‌కు పంపాలన్నారు. యూనిఫాం సర్వీస్ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీసు అధికారులకు సీపీ సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు బోనాల కిషన్, తిరుమల్, సతీష్ బాబు, జితేందర్‌రెడ్డి, రఘు, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, ఎన్నికల సూపరింటెండెంట్ విశ్వనారాయణ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషా

# మీ సమాచారం విలువ రూ.50కోట్లు

- స్టేక్ హోల్డర్స్‌తో బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- హైదరాబాద్, వరంగల్ నగరాలకే విజన్-2050 ప్రాజెక్టులకు చోటు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 4: విజన్-2050లో భాగంగా సమగ్ర ప్రజారవాణా ప్రణాళిక, ఎకనామిక్ డెవలప్‌మెంట్ ప్లాన్, భూ వినియోగ ప్రణాళికలతో కూడిన సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తే నగరానికి రూ.50కోట్లు మంజూరు కానున్నట్లు బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ ప్రా జెక్టుల రూపకల్పన, సమాచారాన్ని స్టేక్ హోల్డర్స్ ఇవ్వాలని కోరారు. మీరిచ్చే సమగ్ర సమాచార విలువ నగరానికి రూ.50కోట్లు దక్కించిపెడతాయనేది గుర్తించాలని స్టేక్ హోల్డర్స్‌కు సూచించారు. గురువారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో స్టేక్ హోల్డర్స్‌తో ఆయన సమావేశమయ్యారు. విజన్-2050, మాస్టర్‌ప్లాన్-2048 ప్రాజెక్టులను సమీక్షించారు. నగర భవిష్యత్ అభివృద్ధి, రవాణా, ఎకనామిక్ గ్రోత్ సిటీ, భూ వినియోగం, నీటి వనరులు, నగరాభివృద్ధి తదితర అంశాలను సమీక్షిం చారు. ఆర్‌టీసీ, పోలీస్, ఆర్‌టీఏ, స్మార్ట్‌సిటీ ప్రతినిధులు, కుడా, బల్దియా అధికా రులతో ఆయన ప్రాజెక్టు గురించి చర్చించారు. విజన్-2050 ప్రాజెక్టులో తెలంగాణలో హైదరాబాద్, వరంగల్ రెండు నగరాలే ఎంపికైనట్లు తెలిపారు. ఈ క్రమంలో బాధ్యతను గుర్తించి సమష్టి కృషి, సమన్వయంతో ప్రణాళికల రూపకల్పన చేయాలని కమిషనర్ కోరారు. సమావేశంలో కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఆర్‌టీసీ ఆర్ఎం శ్రీలత, డీటీవో అఫిన్ సిద్దిఖి, బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి

జీడబ్ల్యూఎంసీలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. గురువారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో బల్దియా విభాగాధిపతులు, ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. విద్యుత్ అధికారులతో చర్చించి రోడ్డును ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలన్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపును నిర్లక్ష్యం చేయవద్దన్నారు. విభాగాల వారీగా పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

# ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాలను సాధించాలి: డీఈవో

గీసుగొండ, జనవరి 4:ఫేస్ రికగ్నైజ్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) విద్యా లక్ష్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని డీఈవో వాసంతి అన్నారు. జెడ్పీహెచ్‌ఎస్ ధర్మారం కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన పీఎస్ లేవల్ మండల ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ఫొనిక్ సౌండ్స్‌పై ఉపాధ్యాయులు అవగాహన పరిచి అంగ్లభాషపై పట్టు సాధించేలా చూడాలన్నారు. తద్వారా విద్యార్థులు తప్పులు లేకుండా రాయటం, చదవడం, చక్కటి ఉచ్చారణతో మాట్లాడటం నేర్చుకుంటారన్నారు. ఉపాధ్యాయుల బోధన సోపానాల అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు ప్రతిరోజు విధిగా ఉపాధ్యాయులు అప్‌డేట్ చేయాలన్నారు. ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వేలో డ్రాపవుట్, లాంగ్ ఆప్‌సెంట్ విద్యార్థులు ఉంటే గుర్తించి స్థానిక పాఠశాలల్లో చేర్పించాలని సీఆర్పీలకు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో రవిందర్, కాంప్లెక్స్ హెచ్ఎం పట్టాభి, ఆర్పీలునాగార్జున, కరుణాకర్, పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కమిషనర్

# పన్నుల వసూళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి

### వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

పోచమ్మమైదాన్, జనవరి 4: వాణిజ్య పన్నుల వసూళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి అన్నారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని వాణిజ్య పన్నులశాఖ డివిజనల్ కార్యాలయంలో (స్టేట్ టాక్స్ కార్యాలయం) గురువారం 'తెలంగాణ వాణిజ్య పన్నుల నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం' నూతన క్యాలెండర్ -24 ఆవిష్కరణ జరిగింది. తెలంగాణ వాణిజ్య పన్నుల నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కె.గోపికిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం వాణిజ్య పన్నుల నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కె.గోపికిషోర్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాయింట్ కమిషర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ ఎంఏ ముజీబ్, ట్రెజరర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రమేష్, జగదీష్, అజయ్‌కుమార్, రంజిత్, అనుకిరణ్, రవికుమార్, మమత, వరూధిని, అరుణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రభాకర్, శర్మ పాల్గొన్నారు.

# పెండింగ్ భూ సేకరణకు చర్యలు చేపట్టాలి

### రెవెన్యూ అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, జనవరి 4: జిల్లాలో పెండింగ్ భూ సేకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో పెండింగ్ భూ సేకరణకు సంబంధించి వరంగల్ ఆర్‌డీవో వాసుచంద్ర, నర్సంపేట ఆర్‌డీవో కృష్ణవేణి, సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ నేషనల్ హైవే ఇరిగేషన్ ప్రాజెక్టుల భూ సేకరణపై సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సేకరణపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణ పూర్తి చేయడానికి ప్రభుత్వం మంజూరి చేసిన జీవో నిబంధనల ఆధారంగా మూడు అంశాలను పరిగణలోకి తీసుకొని భూమిని కోల్పోతున్న రైతుల నుంచి అభ్యంతరాలను పరిశీలించి చేసేలా సర్వే వేగవంతం చేయాలన్నారు.

- జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించుటకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఉమ్మడి గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్ష ద్వారా దరఖాస్తుల స్వీకరణ పోస్టర్లను గురుకులాల సమన్వయ అధికారి సమ్మయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్వహిస్తున్న గురుకులాల్లో సీటు సాధించడం తమ పిల్లల బంగారు భవిష్యత్తు బాటలు వేస్తామని ఆశిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశానికి ప్రవేశ పరీక్ష దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు 2024-25కు ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 6 వరకు రూ. 100 రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని తెలిపారు.



గురుకులాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

# మహాజాతరలో మెరుగైన వైద్య సేవలందించాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 4: ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. ములుగు కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన గురువారం జరిగిన ఉమ్మడి వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడారు. మహాజాతరలో వైద్య, ఆరోగ్య శాఖ నిర్వర్తించే బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అధికారుల మధ్య సమన్వయం కలిగి ఉండాలని అన్నారు. డీఎంహెచ్‌వో, జాతర నోడల్ అధికారి అల్లెం అప్పయ్య మాట్లాడుతూ.. మేడారం మహాజాతరలో విధులు నిర్వర్తించడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్యాధికారుల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు.

వివిధ జిల్లాల్లో పనిచేసే వైద్యాధికారులు సైతం జాతర సమయంలో ప్రత్యేక వైద్యసేవలు అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలని హెల్త్ డైరెక్టర్‌ను కోరారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యాధికారులు సాంబశివరావు, ప్రశాంత్, రమణ, మధుసూదన్, శిరీష, అంబరీష్, ములుగు జిల్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ సీటుపై పోలీసు అధికారి గురి?

| |
|---|
| పదవికి రాజీనామా చేసేందుకు సన్నాహాలు |
| కాంగ్రెస్ నుంచి బరిలో దిగేందుకు నేతల పోటాపోటీ |
| బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ వైపు చూపులు |
| టికెట్ ఇస్తే జంప్ చేసేందుకు యత్నాలు |



వరంగల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంపీ స్థానంపై పోలీసు అధికారి గురిపెట్టినట్లు తెలుస్తోంది. గతంలో వరంగల్‌లో పోలీస్ ఉన్నతాధికారిగా పనిచేసిన ఐపీఎస్ అధికారి ఒకరు ఉద్యోగానికి రాజీనామా చేసి ఎంపీ ఎన్నికల బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ మధ్యనే అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే సైతం ఎంపీ బరిలో నిలిచేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేయడంతో అందరి చూపు కాంగ్రెస్ వైపే చూస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏకపక్షంగా ఓటమి పాలవడంతో ఆ పార్టీ ఒక్కసారిగా డీలా పడింది. దీంతో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి ఎంపీ టికెట్ కైవసం చేసుకోవాలని కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు ఎదురు చూస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఉద్యమ నాయకులు, జర్నలిస్టు నాయకులు, జిల్లా రిజిస్ట్రార్ సైతం ఎంపీ బరిలో కాంగ్రెస్ నుంచి పోటీలో నిలిచేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.

## బీఆర్‌ఎస్ డీలాతో కాంగ్రెస్ వైపు చూపు

బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు మినహా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసిన విషయం తెలిసిందే. ఓటమి పాలైన బీఆర్‌ఎస్ ఒక్కసారిగా డీలా పడిపోవడంతో పడిపోయిన బీఆర్‌ఎస్ తిరిగి పుంజుకునే పరిస్థితి లేదనే అభిప్రాయంతో కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నారు. కాంగ్రెస్‌లో చేరి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేద్దామనే ఆశతో వారున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

ఆ పార్టీకి చెందిన దొమ్మాటి సాంబయ్య, సిరిసిల్ల రాజయ్య తీవ్రంగానే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు మరికొద్ది మంది పోలీసు ఉన్నతాధికారులు ఎంపీ ఎన్నికల బరిలో నిలిచేందుకు తీవ్రంగానే ప్రయ త్నాలు చేస్తున్న ట్లు తెలుస్తోంది. విద్యార్థి జేఏసీ నాయకులు జోరిక రమేష్, బోడ డిన్న, నిరంజన్ తదితరులు సైతం ఎంపీ బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నట్లు సమాచారం. జిల్లాలోని ఓ కాం గ్రెస్ నేత భర్తతో అత్యంత సన్నిహితంగా ఉండే పోలీ స్ ఉన్నతాధికారికి ఎంపీ టికెట్ వస్తుందనే ప్రచారం సైతం జిల్లాలో జోరుగా సాగుతోంది. పర్వతగిరి జడ్పీటీసీ సింగ్‌లాల్ కాంగ్రెస్ నుంచి మహబూబాబాద్ ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని అధిష్ఠానం చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిలాలోని ఎంపీ టికెట్ల కోసం జిల్లాలోని పలువురు నేతలు ఢిల్లీ కేంద్రంగా పావులు కదుపుతూ వారి వారి గాడ్‌ఫాదర్‌లను సంప్రదిస్తూ దారులు వెదుకుతున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ గాలి వీస్తున్న నేపథ్యంలో ఎలాగైనా టికెట్ సాధించి పదవి పొందాలనే ధీమాతో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు తహతహలాడు తున్నారు. జిల్లాలో రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న అరికోట్ల రవితోపాటు జర్నలిస్టు నేత బీఆర్ లెనిన్ సైతం వరంగల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్నట్లు సమాచారం.

## కూచిపూడి నృత్యంలో సమీక్షారెడ్డికి అవార్డు

సుబేదారి, జనవరి 4: ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఇటీవల జరిగిన 13వ కృష్ణ రంగ్ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో హనుమకొండ సుబేదారి ప్రాంతానికి చెందిన కె.సమీక్షారెడ్డి ప్రతిష్ఠాత్మకమైన ప్రెసిడెంట్ చాయిస్ అవార్డు గెలుచుకుంది. సమీక్షారెడ్డి ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. సమీక్షారెడ్డిని గురువారం ఉపాధ్యాయులు అభినందించారు.

## 7న మడికొండలో రెడ్డి సంక్షేమ సంఘం సమావేశం

కాళోజీ జంక్షన్, జనవరి 4: ఉమ్మడి వరంగల్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం, డెయిరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. విశిష్ట అతిథిగా పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గల సుమారు 3వేల మంది సభ్యులు ఉన్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో సంక్షేమ సంఘం ఆదాయం, ఖర్చులు పరిశీలించి, ఇంకా మున్ముందు రెడ్డి కులస్తుల కోసం చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలను సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. రెడ్డి బంధువులందరు సర్వసభ్య సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా..

**● కొనసాగుతున్న 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమం ● ఇప్పటివరకు 2,283 మందికి విముక్తి**

హనుమకొండ రూరల్, జనవరి 4: వెట్టిచాకిరిలో మగ్గుతున్న చిన్నారులు, అనాథ, వీధి బాలలకు విముక్తి కల్పించి వారికి రక్షణ కల్పించేందుకు యేటా జనవరి మాసంలో ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను చేపడుతోంది. బాలల హక్కుల పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా హనుమకొండ జిల్లాలో 2015 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బావిభారత పౌరులైన బాలలు బడిలో చదువుకో వాల్సిన సమయంలో కార్మికులుగా మారి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని భావించిన ప్రభుత్వం.. ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. యేటా జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పిస్తూ బడికి పంపే ఏర్పాట్లు చేస్తుంది. 2015 నుంచి ఇప్పటి వరకు సుమారు 2,283 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించారు. నిరక్షరాస్యత, అవగాహన లోపం, పేదరికం కారణంగా పలువురు తమ పిల్లలను పనులకు పంపుతు ంటారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేడమే లక్ష్యంగా అధికారులు యేటా రెండు దపాలుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసులు, కార్మికశాఖ, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధుల బృందాలను ఏర్పాటు చేస్తారు.



### బాధ్యులపై కేసుల నమోదు

ఈ బృందాలు నెలరోజులపాటు వాహనాల గ్యారేజీలు, హోటళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తిస్తారు. గుర్తించిన వారిలో 14ఏళ్లలోపు పిల్లలు బాలకార్మికులుగా పనిచేస్తు ంటే బాధ్యులపై కార్మికశాఖ కేసులు నమోదు చేస్తుంది. హానికరమైన పనులలో 15-18 యేళ్ల వయస్సున్న వారుంటే కేసులు నమోదు చేస్తారు. గుర్తించిన బాలకార్మికులు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగిస్తారు. ఒకవే ళ అనాథలుంటే వారిని ఆశ్రమాలకు తరలించి పాఠశాలల్లో చేర్పిస్తారు. బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేస్తారు. అదృశ్యమైన పిల్లల వివరాలను దర్పణ్ పోర్టల్‌లో నమోదు చేసి, అనంతరం చర్యలకు శ్రీకారం చూడతారు. యాం టీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సహకారంతో అక్రమ రవాణాకు గురైన పిల్లలను గుర్తించేం దుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తామరు. తప్పిపో యిన చిన్నారులు, దుర్భర జీవితం గడుపుతున్న వారిని గుర్తించి తల్లిదండ్రులకు, ప్రభుత్వ, వివిధ స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తారు.

**గుర్తించిన బాలకార్మికుల వివరాలు ఇవే..**

| ఇయర్ | ఆపరేషన్ స్మైల్ | ఆపరేషన్ ముస్కాన్ | మొత్తం |
|---|---|---|---|
| 2015 | 108 | 178 | 286 |
| 2016 | 152 | 172 | 324 |
| 2017 | 177 | 110 | 287 |
| 2018 | 103 | 113 | 216 |
| 2019 | 68 | 211 | 279 |
| 2020 | 168 | – | 168 |
| 2021 | 178 | 228 | 406 |
| 2022 | 112 | 95 | 207 |
| 2023 | 63 | 47 | 110 |

### బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు

**రమేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్**



14 ఏళ్లలోపు వయస్సున్న బాల, బాలికలను పనిలో పెట్టుకోవడం నేరం. అలా ఎవరైనా బాల, బాలికలను పనిలో పెట్టుకొని బాలకార్మికులుగా మారిస్తే సంబంధిత యజమానిపై కేసులు నమోదు చేస్తాం. మైనర్లను ఎట్టిపరిస్థితుల్లో పనుల్లో పెట్టుకోవద్దు. ఎవరైనా బాలకార్మికులను గుర్తించినట్లయితే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

### తనిఖీలు నిర్వహిస్తున్నాం..

**సంతోష్‌కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి**



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల తో తమ పిల్లలను పని చేర్పిస్తున్నారు. వ్యాపారులు పిల్లల కు తక్కువ జీతాలు ఇచ్చి పనిలో పెట్టుకుంటున్నారు. తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులు ఉన్నట్లయితే 1098కు సమాచారం అందించాలి. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తాం.

# ఎమ్మెస్పీతోనే సామాజిక, రాజకీయ న్యాయం

### ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

హసన్‌పర్తి, జనవరి 4: మహజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ)తోనే సామాజిక రాజకీయ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మెస్పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంద కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెస్పీ పేదల కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణలోని అన్ని పార్టీలు అగ్రకుల పార్టీలేనని, వాటి ద్వారా న్యాయం జరుగదన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాబోయే రోజుల్లో మహజనులతో కలిసి మహజన రాష్ట్రాన్ని స్థాపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, నాయకులు రాజారపు భిక్షపతి, ఆరెపెల్లి పవన్, రాజారపు కిరణ్, ఆకారపు రాజు, బొక్క సాంబరాజు, కుక్కమూడి మొగిళి, నమీండ్ల సూర్యం, మేకల రమేశ్, మేకల కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో ఎమ్మెస్పీ జెండావిష్కరిస్తున్న నాయకులు

## లూయిస్ బ్రెయిలి జయంతి వేడుకలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ టౌన్, జనవరి 4: హనుమకొండ జిల్లా పరిషత్ హాల్‌లో తెలంగాణ అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం లూయిస్ బ్రెయిలి 215వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ రాజీవ్ శుక్లా, హనుమకొండ, వరంగల్ డీడబ్ల్యువోలు మధురిత, శారద, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ కె.అనితారెడ్డి, ప్రమోద హాస్పిటల్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అతిథుల చేతుల మీదుగా 2024 బ్రెయిలి క్యాలెండర్ ఆవిష్కరించారు. బ్రెయిలి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎస్.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజు, ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి జి.శ్రీను, అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.రవిందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కార్తిక్, సంయుక్త కార్యదర్శి కమల, సలహాదారులు విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న తాళ్ల మల్లేశం

కాజీపేట, జనవరి 4: ఇటీవల కేరళలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులకు కాంస్య పతకాలు లభించాయి. పతకాలు లభించిన వారిలో ఏడో తరగతి చదువుతున్న అయాన్ నాయక్, తొమ్మిదో తరగతి చదువుతున్న సాయిచరణ్ ఉన్నారు. వీరిని గురువారం తాళ్ల పద్మావతి పాఠశాల ఆవరణలో విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.


## రెండు రోజులు నీటి సరఫరా బంద్

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండసిటీ), జనవరి 4: ధర్మసాగర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు అమ్మవారిపేట వద్ద ఏర్పడిన లీకేజీ కారణంగా వరంగల్ పరిధిలో రెండు రోజులపాటు నీటి సరఫరా ఉండదని ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీమాబాద్, ఉర్సు, శివనగర్, పెరుకవాడ, చింతల్, ఖిలావరంగల్, తూర్పు, మధ్య కోట, ఎస్‌ఆర్‌ఆర్ తోట, యాసీ రెడ్డినగర్, నాగమయ్యగుడి, రుద్రమనగర్ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

# డిగ్రీ ఈ-కామర్స్ ప్రశ్నపత్రంలో రెండుసార్లు ఒకే ప్రశ్న

**ఆందోళనకు గురైన ఫైనల్ ఇయర్ విద్యార్థులు**

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 4 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం జరిగిన బీకాం ఫైనల్ ఇయర్ 5వ సెమిస్టర్‌లోని ఈ-కామర్స్ పరీక్ష పత్రంలో ఒకేప్రశ్న రెండుసార్లు వచ్చింది. దీంతో ఆ సబ్జెక్ట్ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వర్సిటీ పరిధిలో డిసెంబరు 20వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొ దటి సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడోసెమ్, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐదోసెమ్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యా హ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో అందు లో భాగంగా గురువారం డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు జరుగుతున్న ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ ప్రశ్నాపత్రం సెక్షన్-ఏలో 8 ప్రశ్నలకు గాను ఐదు ప్రశ్నలకు సమధానాలు రాయాల్సి ఉంటుంది. ప్రతీ ప్రశ్న కు మూడు మార్కుల చొప్పున ఐదు ప్రశ్నలకు 15 మార్కులు కేటాయించారు. కాగా, ప్రశ్నాపత్రంలోని 1లో ఏ నుంచి హెచ్ వరకు 8 ప్రశ్నలుండగా అందు లో బి,హెచ్ ప్రశ్నలు (వాట్ ఈజ్ సెర్చ్ ఇంజన్) ఒకేలా ఉన్నాయి. దీంతో డిగ్రీ విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. 8 ప్రశ్నలకు గాను ఐదింటికి సమాధానాలు రాయాల్సి ఉండగా మూడు ప్రశ్నలు చాయిస్ కింద పోతాయి. అయితే ఈ కామర్స్ ప్ర శ్నాపత్రంలో రెండు ప్రశ్నలు ఒకేలా ఉండడంతో ఒక్కచాన్స్ కోల్పోయామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నాపత్రం తయారు చేసిన అ ధికారులు ఈ తప్పిదాన్ని గుర్తించకపోవడంతో తమకు అన్యాయం జరిగిందని వారు వాపోతున్నారు.



కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ ఫైనల్ ఇయర్ ఐదో సెమిస్టర్ ఈ-కామర్స్ రెండుసార్లు వచ్చిన ఒకేప్రశ్న

# జనగామలో కేయూ పరీక్షా కేంద్రాల తనిఖీ

కేయూ క్యాంపస్, డిసెంబరు 4: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల కేంద్రాలను గురువారం జనగామలో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మ ల్లారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య బృందం తనిఖీలు నిర్వహి ంచింది. జనగామలోని ఏకశిల డిగ్రీ, పీజీ కళాశా లలు, ఆర్ఆర్ఎం, రాజరాజేశ్వరి డిగ్రీ కళాశాల పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేశారు. అలాగే గురువారం వరంగల్ నగరంలో ఏఎస్ఎం డిగ్రీ పీజీ కళాశాల కేంద్రాన్ని కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిల్లు, ఇతర అధికారులు తనిఖీలు నిర్వహించారు.



పరీక్షల కేంద్రాలను తనిఖీ చేస్తున్న పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, బన్న అయిలయ్య

ఎఎం కళాశాలలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను పట్టుకుని ముగ్గురిని డీబార్ చేసినట్లు డాక్టర్ తిరుమదేవి వెల్లడించారు. పరీక్షల ప్రశాంతంగా నిర్వహించాలని సంబం.దిత అధికారులకు చూచించారు.

### కేయూ డిగ్రీ పరీక్షల్లో 36 మంది డీబార్

కాకతీయ యూనివర్సిటీ గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలో చూచిరాతకు పాల్పడిన విద్యార్థులను తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిలు గురువారం వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 16 మంది, వరంగల్‌లో 14 మంది, ఖమ్మంలో 6 మంది డీబారైనట్లు తెలిపారు. పరీక్షల నిబంధనల మేరకు వీరిపై చర్యలు చేపడుతామని వెల్లడించారు.

# ఎవరికీ పట్టని 'కాజీపేట'

**సమస్యల వలయంలో జంక్షన్ ● విస్తరణకు నోచుకోని చౌరస్తా ● ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ ● ప్రతిపాదనలకే పరిమితమైన ఆస్పత్రి ● ఊసేలేని బస్టాండ్ నిర్మాణం**


విస్తరణకు నోచుకోని కాజీపేట చౌరస్తా


అసంపూర్తిగా నిర్మించిన ఆర్వోబీ

కాజీపేట, జనవరి 4: హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి.. రైల్వే పరంగా నిత్యం 150 రైళ్ల రాకపోకలు.. రోజూ వేలాది మంది ప్రయాణాలతో నిత్యం రద్దీగా ఉండే ట్రైసిటీలో భాగమైన కాజీపేట జంక్షన్ సమస్యలకు నిలయంగా మారింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎందరు పాలకులు మారినా.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. కాజీపేట మాత్రం అభివృద్ధిలో అమడ దూరంలోనే ఉంటోంది. ప్రతీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కాజీపేట అభివృద్ధిపై హామీలు ఇస్తూ ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆ ఊసే మరిపోతున్నారు. ఇది యాభై ఏళ్లుగా జరుగుతున్న తతంగమే.. ఎవరు ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్న వారిని విమర్శిస్తూ మళ్లీ వారు అధికారంలో రాగానే అదే తంతు కొనసాగిస్తున్నారు.

### ఐదేళ్లుగా పూర్తికాని ఆర్వోబీ

కాజీపేట ఫాతిమానగర్‌లో అదనంగా నిర్మించడానికి తలపెట్టిన ఆర్వోబీ నిర్మాణం ఐదేళ్ల కిందట ప్రారంభించారు. అది ఇప్పటికీ పూర్తికాలేదు. అక్కడే ఉన్న పాత బ్రిడ్జిని 50 యేళ్ల కిందట అప్పటి జనాభాకు అనుగుణంగా నిర్మించారు. ప్రస్తుతం ఆ బ్రిడ్జి అక్కడక్కడా పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందో నని ప్రయాణికులు భయం, భయంగా ప్రయాణించే పరిస్థితి నెలకొంది. పైగా హైదరాబాద్ - వరంగల్ ప్రధాన రహదారి ఇది ఒక్కటే. హైదరాబాద్ నుంచి వరంగల్ వచ్చే ప్రజాప్రతినిధులు ఇదే బ్రిడ్జిగుండా ప్రయాణిస్తుంటారు. ఇక ఉదయం సమయాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వివిధ పనులకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఏదైనా చిన్న ప్రమాదం జరిగితే గంటలకొద్దీ ట్రాఫిక్‌జామ్ అవుతోంది. కొత్త బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### విస్తరణకు నోచుకోని చౌరస్తా..

ట్రైసిటీలో చౌరస్తాలన్నీ దాదాపు విస్తరించారు. కొన్ని మోడల్ జంక్షన్లుగా రూపుదిద్దారు. కాజీపేట - వరంగల్ ప్రధాన రహదారి కాజీపేట చౌరస్తాను మాత్రం ఇప్పటికీ విస్తరించలేదు. సాయంత్రం అయ్యిందంటే నిత్యం రద్దీగా ఉండి ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ చౌరస్తా చూస్తేనే ఏదో గజిబిజి ప్రాంతంగా ఉంటోంది.. చౌరస్తా మధ్యలో వాటర్ ఫౌంటేన్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో పలు సందర్భాలలో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ ఊసే మరిచారు.

### వంద పడకల ఆస్పత్రికి సుస్తీ

కాజీపేటలో వందపడకల ఆస్పత్రి నిర్మాణానికి సుస్తి చేసింది. పదేళ్ల కిందట కాజీపేట మినీ మునిసిపాలిటీలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. గదుల నిర్మాణం, ఆస్పత్రికి కావాల్సిన అన్ని సౌకర్యాలు నిర్మించినప్పటికీ అది ఇప్పటికీ పూర్తికాలేదు. సాక్షాత్తూ నాటి ఆరోగ్య శాఖమంత్రి లక్ష్మారెడ్డి కాజీపేటలో మినీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పి హామీ ఇచ్చినా ఇప్పటికీ పూర్తి కాలేదు. కాజీపేట, పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైనా, గర్భిణులు, వృద్ధులు వైద్యం కోసం హనుమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే.

### బస్టాండ్ ఊసేలేదు..

కాజీపేటలో ఇప్పటికీ బస్టాండ్ లేదు. రోడ్డుపైన ఒక చిన్న రేకుల షెడ్డులోనే బస్టాండ్‌ను నడిపిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ నుంచి హైదరాబాద్‌కు బస్సుల ద్వారా వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇక నరకమే. ఎండాకాలం వస్తే ఎండకు, వర్షాకాలం వస్తే వర్షానికి ప్రజలు తడుచుకుంటూ బస్టాండ్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముప్పై ఏళ్లుగా కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలని నాటి మంత్రి దాస్యంప్రణయ భాస్కర్ ఎన్నో ఉద్యమాలు చేశారు. చౌరస్తా సమీపంలో ఆర్టీసీ సుమారు 15 ఎకరాల స్థలాన్ని పరిశీలించి హద్దులు కూడా వేశారు. ప్రైవేట్ వ్యక్తుల స్థలానికి మార్కెట్ రేటు కట్టివ్వకపోవడంతో అది రద్దయ్యిందని స్థానికులు తెలుపుతుంటారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం ఊసే లేదు. ప్రతి ఎన్నికల్లో కాజీపేటను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పే నాయకులు ఈసారైనా కాజీపేట అభివృద్ధికి తోడ్పడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ములుగు ఏజెన్సీలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయిన ముఖ్యంగా ములుగు ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, మంగపేట, వెంకటాపురం(నూగురు), తాడ్వాయిలోని పలు ప్రాంతాలలో రాత్రి ఉష్ణోగ్రతలు 16డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. పగటి పూట సగటున 31 డిగ్రీలుగా ఉంటోంది. చలికి తోడు తెల్లవారుజాము నుంచి పొగమంచు కురుస్తోంది. ఉదయం 9గంటల వరకు ఈ ప్రభావం ఉంటోంది. శ్వాసకోస వ్యాధులు ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారు.భూపాలపల్లి జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రి సమయంలో చలి తీవ్రమవుతోంది. జిల్లాలో గురువారం గరిష్ఠంగా 30 డిగ్రీలు, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హనుమకొండ జిల్లాలో గత నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు తీవ్రగా కమ్ముకొని ఉంటుంది. సాయంత్రం 4 గంటలకే చలి ప్రారంభం అవుతోంది. నాలుగు రోజులుగా చలి తీవ్రత ఈ విధంగా నమోదు అయింది. సోమవారం (ఉష్ణోగ్రత 28.9- 15.5), మంగళవారం (ఉష్ణోగ్రత 29.1- 16.8), బుధవారం (28.7- 17.0), గురువారం (29.4- 15.8)గా నమోదు అయింది.

### జనగామలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

చలి కాలం కావడంతో జనగామ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం జిల్లాలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో అత్యల్పంగా చిల్పూరు మండలంలోని మల్కాపూర్‌లో 15.5 డిగ్రీలు, పాలకుర్తి మండల కేంద్రంలో 15.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. అత్యధికంగా దేవరుప్పుల మండలంలోని కోలుకొండ గ్రామంలో 18.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## టీఎన్‌జీవోస్ మెంబర్‌షిప్ పెంచాలి

**టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్**


మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండ రూరల్, జనవరి 4: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం కృషిచేస్తున్న ఏకైక సంఘం టీఎన్‌జీవోస్ యూనియన్ మాత్రమేనని టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు. గురువారం హనుమకొండలో టీఎన్‌జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ ఫోరం కార్యవర్గ సమావేశం ఫోరం అధ్యక్షుడు కలకోట్ల భరత్ అధ్యక్షతన నిర్వహించారు. నూతనంగా ఉద్యోగ విధుల్లో చేరిన సభ్యులకు యూనియన్ మెంబర్‌షిప్ అందజేస్తామన్నారు. ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, శ్యాంసుందర్, రామునాయక్, సారంగపాణి, లక్ష్మీ ప్రసాద్, రాజేష్‌ఖన్నా, మిస్బా, ఆనంద్‌బాబు, సతీష్‌చంద్ర, జైవీర్, అలీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, జనవరి 4: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట దర్గాకు చెందిన దేవర వెంకటేశ్వర్లు (42) కూలిపని చేస్తూ మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య దేవర శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


దేవరాజు(ఫైల్)

కమలాపూర్, జనవరి 4 : కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మండ దేవరాజు(24) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు, ఎస్‌ఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న యువకుడు స్వగ్రామం నుంచి అంబాల గ్రామ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఓ చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్‌ఐ తెలిపారు. కాగా, సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## 'ప్రజాపాలన'లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు

ఐనవోలు, జనవరి 4: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన' సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తూ వేదికలపై ఆసీనులవుతుండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాపాలనలో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రొటోకాల్ ప్రకారం సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులే స్టేజీపై కూర్చోవాలి. కానీ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరైన సందర్భాల్లో వేదికపైకి పిలవకపోయినా కొందరు మండల, జిల్లా నాయకులు నేరుగా వచ్చి కూర్చుంటున్నారు. గురువారం కక్కిరాలపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో వేదికపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉండగానే, పలువురు నాయకులు వచ్చి కూర్చున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రశ్నించగా, 'మేం పిలవకపోయినా వచ్చి కూర్చుంటున్నారు దానికి మేం ఏం చేయాలి..?' అంటూ అధికారులు చేతులెత్తేశారు. ఇటీవల పున్నేలులో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమంలో కూడా కాంగ్రెస్ నాయకులు వేదికపై కూర్చోవడంపై విమర్శలు వచ్చాయి. ఐనవోలు జాతర సమీక్ష సమావేశంలోకి కొందరు నాయకులు ఇలాగే చొచ్చుకవస్తే మంత్రి కొండా సురేఖ వారించి, వారిని బయటకు పంపించారు. ఆయినప్పటికీ రోజూ ఏదో ఒక కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతూనే ఉందని పలువురు వాపోతున్నారు. ఇదిలావుండగా, ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమాల షెడ్యూల్‌ను ఇటు అధికారులు గానీ, అటు ప్రభుత్వ పీఏగాని ముందస్తుగా తెలుపడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## చైల్డ్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభం

సుబేదారి, జనవరి 4: దివ్యాంగ పిల్లల కోసం బాలసముద్రంలో గురువారం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ మాస్టర్ ఆఫ్ ఆక్యుపెన్షనల్ థెరపిస్టు డాక్టర్ అంకు కుమార్, చైల్డ్ సైకాలజిస్టు డాక్టర్ లీనా మాట్లాడుతూ.. ఈ సెంటర్‌లో పుట్టిన పిల్లల నుంచి 15 యేళ్ల పిల్లల వరకు ఎదుగుదలలో ఎలాంటి లోపం ఉన్నా, మాటలు రాకపోయినా, చదువులో వెనుకబడిన పిల్లలకు నిపుణులైన డాక్టర్లతో చికిత్స చేయిస్తామన్నారు. దివ్యాంగ పిల్లలకు ఇంకా అనేక రకాలైన లోపాలకు చికిత్స చేస్తామని, ఈ నెల 10వరకు ఉచితంగా చూస్తామన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

## వనదేవతల సన్నిధిలో వైద్య, విద్యుత్ ఉన్నతాధికారులు


వనదేవతలను దర్శించుకుంటున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మేడారం, జనవరి 4: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌రెడ్డి గురువారం వేర్వేరుగా పర్యటించారు. వనదేతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహాజాతరకు తమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పరిశీలించారు. ఈసందర్భంగా హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ వనదేవతల మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ మహాజాతరకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. వరద ముంపుతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ధ్వంసమైనప్పటికీ వెనువెంటనే మరమ్మతులు చేపట్టి నిరంతరం విద్యుత్ అందించేదిశగా పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు. కోటి 50 లక్షలకు పైగా వచ్చే మేడారం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. 230 ట్రాన్స్‌ఫార్మర్లు, తొమ్మిదిన్నర కిలోమీటర్ల విద్యుత్‌లైన్లు పూర్తిచేశామని అన్నారు. పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ బస్టాండ్, గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచామని అన్నారు. వారి వెంట డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, సీజీఎం మోహన్‌రావు, ఎస్‌ఈ మల్సూర్‌నాయక్, డీఈ రాజేశ్వర్‌రావు, ఏడీఈ స్వామిరెడ్డి, ఏడీ వేణుగోపాల్, ఏఈ వేణుకుమార్, ఇతర విభాగాల డీఈలు, ఏడీలు, ఏఈలు ఉన్నారు.


వనదేవతలను దర్శించుకుంటున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

## పాలకుర్తిలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడలు

పాలకుర్తి, జనవరి 4 : పాలకుర్తి మండల కేంద్రంలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు యువ చైతన్య యూత్ బాధ్యులు ఎడవెల్లి సోమేశ్వర్ తెలిపారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి యవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచిన జట్లకు నగదుతో పాటు మెమోంటోలు అందచేస్తామని చెప్పారు. మొదటి బహుమతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, నాల్గవ బహుమతి రూ.8వేలు, ఐదవ బహుమ తి రూ.6వేలు, ఆరవ బహుమతి రూ.4వేల నగదును అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల జట్లు 8328004828, 9676428932, 995969 5365 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## మహిళపై దాడి

హనుమకొండ క్రైం, జనవరి 4: షట్టర్ యజమాని మాట్లాడనివ్వలేదని మహిళపై ఇద్దరు దాడి చేసి షాపును ధ్వంసం చేసిన ఘటన హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ న్యూరాయపురకు చెందిన వంగాల వాణిశ్రీ హనుమకొండ పోలీసు స్టేషన్ ముందు లైన్‌లో ఓ షట్టర్ అద్దెకు తీసుకుని లేడీస్ ఎంపోరియం నడిపిస్తోంది. షాపు ముందు ఉన్న గాదం స్వరూప, గాదం శృతిలు బుధవారం సాయంత్రం షాపునకు వచ్చి వాణిశ్రీతో గొడవకు దిగారు. తమతో చాలా రోజులుగా ఎందుకు మాట్లాడడం లేదని, ఇంటి యజమాని మాట్లాడవద్దని చెప్పడంతోనే తమతో మాట్లాడడం లేదని వాణిశ్రీపై ఇద్దరు గొడవకు దిగారు. వాణిశ్రీపై దాడి చేయడంతో పాటు షాపులో ఉన్న ఫర్నిచర్, సామగ్రిని ధ్వంసం చేశారు. తనపై దాడి చేయడంతో పాటు సుమారు రూ. 30 వేల విలువ గల సామగ్రిని ధ్వంసం చేసినట్టు పోలీసుకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం స్వరూప, శృతి పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

## అట్రాసిటీ కేసులో ఇద్దరి అరెస్టు

మహాముత్తారం, జనవరి 4: అట్రాసిటీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి గురువారం వెల్లడించారు. మహాముత్తారం మండలంలోని మాదారానికి చెందిన ఎం.డి.అలావుద్దీన్, షఫీయొద్దీన్ డిసెంబరు 30న మాదారంలో ఎన్నికల విధుల్లో ఉన్న స్థానిక అంగన్‌వాడీ టీచర్ బెల్లంకొండ భీమక్క విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెను కులంపేరుతో దూషించారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఇదే ఘటనలో అంగన్‌వాడీ టీచర్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కూడా కేసునమోదు చేశామన్నారు.





ఆంధ్రజ్యోతి WARANGAL CITY

# వరంగల్ సిటీ

● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం

శుక్రవారం 5 జనవరి 2024

## క్రీడాకారుడిని సన్మానించిన సీపీ

హనుమకొండ క్రైం, జనవరి 4: జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌లో రాణించిన హాకీ క్రీడాకారుడు, సుబేదారి ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ షుకూర్ కుమారుడు హస్నన్‌ను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. గురువారం సీపీ కార్యాలయానికి పిలిచి ఘనంగా సత్కరించారు. హస్నన్ డిసెంబరు 28 నుంచి జనవరి 1వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో తెలంగాణ జట్టు తరుపున పాల్గొని సత్తా చాటాడు. జట్టు గెలుపునకు దోహదపడి ఉత్తమ క్రీడాకారుడుగా గుర్తింపు పొందాడు. హస్నన్ ప్రతిభను గుర్తించిన సీపీ అభినందించారు.



క్రీడాకారుడిని అభినందిస్తున్న సీపీ

## గణపతి దేవాలయానికి రథం వితరణ



దేవాలయానికి రథాన్ని అందజేస్తున్న భక్తుడు బత్తిని సతీష్‌గౌడ్

ఖిలావరంగల్, జనవరి 4: సిద్ధిబుద్ధి గణపతి దేవాలయానికి బత్తిని సతీష్‌గౌడ్ రథాన్ని గురువారం వితరణ చేశారు. శివనగర్‌లోని దేవాలయానికి బత్తిని సాంబయ్య స్మారకార్థం ఆయన కుమారుడు సతీష్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ కర్రతో రథాన్ని తయారు చేసిన విశ్వబ్రాహ్మణుడు శంకరాచారి ఇంటినుంచి బాజాభజంత్రీలతో శివనగర్ రైల్వేస్టేషన్ మీదుగా అయ్యప్పస్వాములు రథాన్ని ఊరేగించారు. రథానికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, మంగళహారతులు పట్టారు. సుమారు రూ.3 లక్షల వ్యయంతో రథాన్ని తయారుచేయించి దేవాలయానికి బహూకరించిన సతీష్ గౌడ్ దంపతులను ఆలయ ధర్మకర్త, పూజారి డాక్టర్ శ్రీరామ్‌శర్మ సన్మానించారు.

## ఆలయ నిర్మాణానికి రేపు భూమి పూజ

మామునూరు, జనవరి 4 : నగరంలోని 43వ డివిజన్ బెస్తం చెరువు కట్టపై రంగశాయిపేట గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం గంగమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గంగపుత్రుల దైవమైన గంగమ్మ తల్లికి పూజలు చేసి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుందన్నారు. ఆలయ నిర్మాణంలో భాగంగా భూమి పూజ కార్యక్రమానికి భక్తులు విధిగా హాజరు కావాలని గంగపుత్ర దేవాలయ నిర్మాణ, అభివృద్ధి కమిటీ ప్రతినిధి బైరి రామేశ్వర్ తెలిపారు.

## కూరగాయల మార్కెట్లో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

వరంగల్‌టౌన్, జనవరి 4 : వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్లో గురువారం తెలంగాణ పొదుపు, మార్కెటింగ్ పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ ఆధ్వర్యంలో పేదలు, అనాథలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు హాజరై పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చలికాలం సందర్భంగా దుప్పట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్ శ్రీను నాయక్, నాయకులు రాయిశెట్టి శ్రీను, పాపాని భాస్కర్, శేఖర్, సామల రాజు, సూరన్న, రహీం, రంజిత్, సర్వర్ పాల్గొన్నారు.

## ఘనంగా లూయిబ్రెయిలీ జయంతి



కేక్ కట్ చేస్తున్న అంధ విద్యార్థులు

పోచమ్మమైదాన్, జనవరి 4: వరంగల్ కొత్తవాడ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో గురువారం డాక్టర్ లూయి బ్రెయిలీ 215వ జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల నిర్వాహకురాలు నలివేల కళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నేరెళ్ల వేణుమాధవ్ సతీమణి నేరెళ్ల శోభారాణి, నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లూయి బ్రెయిలీకి చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం అంధ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు అడెపు శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీనారాయణ, మణికంఠ, రాజ్‌కుమార్, పరమేష్, మానస, హైమావతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పంట యాజమాన్య పద్ధతులు పాటించాలి





పంటక్షేత్ర ప్రదర్శనలో సూచనలు ఇస్తున్న ఉషాదయాళ్, ములుగురోడ్‌లోని వ్యవసాయ క్షేత్రంలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

వరంగల్ సిటీ, జనవరి 4: మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణకు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, ఆర్.శ్రవణ్‌కుమార్, యు.నాగభూషణ్, ఆర్.విశ్వతేజ బృందం సూచించింది. గురువారం శాస్త్రవేత్తల బృందం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు మొక్కజొన్న క్షేత్రాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఏడాది పొడవునా మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున, రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

గీసుగొండ : వ్యవసాయాధికారులు సూచించే పంటల సస్యరక్షణ పద్ధతులను రైతులు పాటించి అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. కొమ్మాలలో మొక్కజొన్న, వేరుశనగ పంట క్షేత్రప్రదర్శనను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో హరిప్రసాద్‌బాబు, ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం, ఏఈవోలు, రైతులు వీరాటి రవిందర్ రెడ్డి, నల్లారి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమాండెంట్ శివప్రసాదరెడ్డి

## ప్రతిభతోనే ఉజ్వల భవిష్యత్తు..

మామునూరు, జనవరి 4 : పాఠశాల దశలో చదివే విద్యార్థులకు ప్రతిభతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాదరెడ్డి అన్నారు. మామునూరు ఫోర్త్ బెటాలియన్ కృష్ణవేణి ప్రతిభ పాఠశాలలో గురువారం పాఠశాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ వి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సీనియన్ సిటిజన్ ఇనుగాల జోగిరెడ్డి పాల్గొన్నారు.

## 'గృహలక్ష్మి' లబ్ధిదారులకు నిధులు ఇవ్వాలి



గవిచర్లలో మాట్లాడుతూన్న జడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి

సంగెం, జనవరి 4: గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇళ్లకు బిల్లులను చెల్లించి ఆదుకోవాలని సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గవిచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రజాపాలన సభ సర్పంచ్ దొనికెల రమశ్రీనివాస్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇళ్లన్నింటికీ ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. గ్రామస్థులు సకాలంలో బకాయి బిల్లుల చెల్లింపులు చేయాలని విద్యుత్ శాఖ ఏఈ తిరుపతిరెడ్డి కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ విస్తరణాధికారి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

● సంగెం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన గ్రామ సభ సర్పంచ్ గుండేటి బాబు అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ కందకట్ల కళావతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వం చేపట్టే పథకాలను నిరుపేదలకు అందించే బాధ్యతలను అధికారులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అనఘాష్టమి వ్రతం



వ్రతాలు ఆచరించుకుంటున్న భక్తులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 4: అనఘాష్టమి వ్రతాన్ని ఆచరిస్తే ఆరోగ్యం, ఐశ్వర్యంతోపాటు విద్య, వివాహాలు జరుగుతాయని అవధూత దత్తపీఠం ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం అనఘాష్టమి వ్రతాన్ని ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో వేయి మంది జంటలతో నిర్వహించారు. ఏటా మార్గశిర బహుళ అష్టమి రోజున ప్రధాన అనఘాష్టమి వ్రతం దత్తక్షేత్రంలో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ, డాక్టర్ వొద్దిరాజు శార్వాణి, చకిలం ఏకాంబరం, విజేందర్ రెడ్డి, గ్రానైట్ శ్రీనివాస్, మేడిశెట్టి కుమారస్వామి, ఓంప్రకాశ్, వడిచెర్ల శ్రీనివాస్, ఆలయ అర్చకులు రాపాక గోపీకృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ వెల్ది రవి పాల్గొన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల పంపిణీ



ప్రతాప్‌నగర్‌లో దరఖాస్తులను పంపిణీ చేస్తున్న మీసాల ప్రకాశ్

ఖిలావరంగల్, జనవరి 4: ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల పంపిణీ చురుగ్గా సాగుతోందని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ అన్నారు. గురువారం ప్రతాప్‌నగర్‌లోని అంబేద్కర్‌భవనంలో ప్రజలకు దరఖాస్తులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సందెల లాజర్, ఈసంపెల్లి ప్రభాకర్, మరుపట్ల సాయికుమార్, గిరిగిరి పుష్ప, బొక్క భాస్కర్, ఐత సురేష్, బైరపాక డేవిడ్‌రాజ్, జన్ను అరవింద్, గజ్జెల సుధాకర్, కొల్లూరి శ్రీధర్, కొల్లూరి బన్నీ, విశాల్ పాల్గొన్నారు. తూర్పుకోటలోని పోచమ్మ దేవాలయంలో దరఖాస్తులను కాంగ్రెస్‌నేత సంగరబోయిన చందర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దడిపల్లి ప్రవీణ్, మాదాసి మధు, రాజబోయిన రాజమల్లు, బిల్ల బాబు, వంగ కుమార్ పాల్గొన్నారు. శివనగర్‌లో మాజీ కార్పొరేటర్ శామంతుల ఉష-శ్రీనివాస్ దంపతులు దరఖాస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయరాంచందర్, పట్బూరి సుధాకర్, కిరణ్, రాజు, వెంకట్, సత్యం, మధు తదితరులు పాల్గొన్నారు.

గీసుగొండ: గీసుగొండలో ప్రజాపాలన గ్రామసభ గురువారం నిర్వహించారు. అభయహస్తం దరఖాస్తులను స్వీకరించినట్లు సర్పంచ్ బాబు తెలిపారు. మొత్తం 1,203 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవేందర్, ఎంపీడీవో వీరేశం, ఎంపీటీసీ దౌడు కోమల, ఎంపీవో ప్రభాకర్, ఏవో హరిప్రసాద్‌బాబు, ఏఈ సుధాకర్, ఏపీఎం సురేష్, దౌడు భరత్ పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం శిబిరంలో పాల్గొన్న దిలీప్‌రాజ్

వరంగల్‌టౌన్, జనవరి 4: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కుమారుడు దిలీప్‌రాజ్ పిలుపునిచ్చారు. గురువారం ఏనుమాముల బాలాజీనగర్ జంక్షన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకుడు పత్తికుమార్ ఆధ్వర్యంలో దిలీప్‌రాజ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా రక్తదానం శిబిరం నిర్వహించగా 40 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రాకేష్, అభిలాష్, ప్రశాంత్, సిలువేరు శ్రీధర్, కొల్లూరి డానియెల్, బ్లడ్ డోనర్ క్యాంప్ మోటివేటర్ ఆర్.కళ్యాణ్, డాక్టర్ సాయి వెంకట పవన్, డాక్టర్ విశ్వనాథ్, నర్స్ ప్రేమలత పాల్గొన్నారు.

● మామునూరు : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తనయుడు కేఆర్ దిలీప్ జన్మదినం సందర్భంగా మామునూరు క్యాంపు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు గురువారం పంపిణీ చేశారు. 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయిత రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనిధి శర్మ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సింగారపు అచ్యుత్, నాయకులు పూర్ణచందర్, రమేష్ పాల్గొన్నారు.

## పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో వాసంతి

వరంగల్ సిటీ, జనవరి 4: పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని డీఈవో వాసంతి ఆవిష్కరించారు. గురువారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఎండి. అబ్దుల్ గఫార్, ఏఎంవో ఎం. సారయ్య, సెక్టోరల్ అధికారి సుధీర్‌బాబుతో కలిసి వాసంతి క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్వీఆర్ రాజు, కృష్ణమూర్తి, తిరుపతిరెడ్డి, అశోక్‌రావు, శ్రీనివాస్, రవీందర్, రహమత్‌బీ, శంకర్‌రావు, రాములు, దయాకర్, సరిత, రాజిరెడ్డి, అంజద్‌పాష, సురేందర్, విజయ్‌కుమార్, రాజేందర్, సమ్మారెడ్డి, యాకూబ్‌రెడ్డి, రవికిరణ్, రాజేందర్, అశోక్‌కుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు





నిందితుని అరెస్టు చూపిస్తున్న ఏసీపీ

పర్వతగిరి, జనవరి 4 : మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. గురువారం పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ముంజాలకుంట తండాకు చెందిన మహిళకు ఐదేళ్ల క్రితం కేసముద్రం మండలంలోని కోమటిపల్లి తండాకు చెందిన బాదావత్ మోహన్‌తో వివాహం అయ్యింది. ఇద్దరికి ఒక బాబు జన్మించిన అనంతరం గొడవల కారణంగా విడాకులు తీసుకుని వేర్వేరుగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో మహిళ హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వెళ్లగా అక్కడ నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లికి చెందిన కణుకుల యాకూబ్‌రెడ్డితో పరిచయం ఏర్పడి చనువుగా ఉండేవారు. అనంతరం వీరిద్దరి మధ్య కూడా గొడవలు జరగడంతో అతడితో మాట్లాడడం మానేసి తల్లిగారి ఊరైన ముంజాలకుంట తండాకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో గత డిసెంబరు 31వ తేదీన యాకూబ్‌రెడ్డి తండాకు వచ్చి ఆమెతో గొడవపడి విచక్షణారహితంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి బాబాయ్ బానోత్ మిట్టు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఎస్సై వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## షూటింగ్ బాల్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

చెన్నారావుపేట, జనవరి 4 : మండ లంలోని అమీనాబాద్ మోడల్ పాఠశాలలో చదువుతున్న కార్తీక్ విద్యార్థుల జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి బుధవారం తెలిపారు. అలాగే కస్తుర్బా గురుకులానికి చెందిన బిందు, ఎ.పల్లవిలకు ఇటీవల తొర్రూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజయవాడలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగే సౌత్ జోన్ నేషనల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తీక్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూ లైబ్రరీని సందర్శించిన విద్యార్థులు



లైబ్రరీ వద్ద పింగళి విద్యార్థులు, వర్సిటీ అధికారులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 4: వడ్డెపల్లిలోని పింగళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు గురువారం కేయూ ప్రధాన గ్రంథాయాలన్ని సందర్శించారు. విద్యార్థుల తమ ఫిల్డ్ స్టడీలో భాగంగా కేయూ లైబ్రరీలోని ప్రధాన విభాగాలను చూసి వివిధ అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో లైబ్రరీ అధికారులు టి.జవహర్, జాన్సన్ ప్రభాకర్, ఫాతిమా, కల్పన, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

వర్ధన్నపేట రూరల్, జనవరి 4 : మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో చేపల వేటకు వెళ్లి భీముని కుంటలో పడి గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం... దమ్మన్నపేటకు చెందిన బెజ్జం వెంకటనర్సు(68) మంగళవారం చేపల వేట కువెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారీ అందులో పడడంతో గల్లంతయ్యాడు. దీంతో వృద్ధుడి ఆచూకీకోసం వెతకగా లభ్యంకాలేదు. తిరిగి గురువారం అతడి మృతదేహం కుంటలో తేలడంతో వెలికితీసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని అప్పగించినట్లు తెలిపారు.

● **బాధిత కుటుంబానికి పరామర్శ**

ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందిన వెంకటనర్సు కుటుంబాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, నగర మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణవరదరాజేశ్వర్‌రావు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట కౌన్సిలర్ సమ్మెట సుధీర్, అప్సర్, కుమారస్వామి, అబ్బిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ

# రాజ్యాధికారమే మహాజన సోషలిస్టు పార్టీ లక్ష్యం

● ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు ప్రణయదీప్

నర్సంపేట, జనవరి 4 : బడుగులకు రాజ్యాధికారమే మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పి) లక్ష్యమని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్ అన్నారు. పట్టణంలో ఎంఎస్‌పి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంఎస్‌పి నియోజకవర్గ కో-ఇంచార్జి తడుగుల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రణయదీప్ మాట్లాడుతూ వికలాంగులు, మహిళలు, అగ్రకుల పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం చేయాలన్న లక్ష్యంతో దండోర దళపతి మందకృష్ణ మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం, వారి హక్కుల కోసం మంద కృష్ణమాదిగ గత 29 ఏళ్ళుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాలు కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు.

గత నవంబర్ 11న హైదరాబాద్‌లో జరిగిన విశ్వరూప మహాసభలో ఎస్సీ వర్గీకరణ కోసం కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అణగారిన వర్గాల ప్రజల కోసం ఎంఎస్‌పి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మహాజన మహిళా సంఘం అధ్యక్షురాలు గుంపుల మాలతిలత, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాబురాజుయాదవ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు, దామెర సుధాకర్, సాయికుమార్, గొబోయిన కత్తిరాములు, రాజు, జి.సరోజన తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 5 జనవరి 2024

# వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

## అయోధ్య రామయ్య అక్షింతలు వితరణ

వర్ధన్నపేట రూరల్, జనవరి 4 : మండలంలోని కట్య్రాల గ్రామం లో గురువారం అయోధ్య రామయ్య పరమ పవిత్ర అక్షింతలను కరసేవకులు ఇంటింటికి పంపిణీ చేశారు. అయోధ్య లో రామమందిర నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు అయ్యారని, ఎందరో వీరుల ఫలితంగా నిర్మిత మైన మందిరం భారత ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపెల్లి మల్లేషం, జడ సతీష్, ప్రశాంత్, రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



అక్షింతలను వితరణ చేస్తున్న కరసేవకులు

## గల్లంతైన వృద్ధుడి మృత దేహం లభ్యం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు

వర్ధన్నపేట రూరల్, జనవరి 4 : మండలంలోని దమ్మన్నపేటలో మంగళవారం చేపల వేటకు వెళ్లి భీముని కుంటలో పడి గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం... దమ్మన్నపేటకు చెందిన బెజ్జం వెంకటనర్సు (68) చేపల వేటకువెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారీ అందులో పడడంతో గల్లంతయ్యాడు. దీంతో వృద్ధుని ఆచూకీకోసం వెతకగా లభ్యంకాలేదు. తిరిగి గురువారం వృద్ధుని మృతదేహం కుంటలో తేలడంతో వెలికితీసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

**• బాధిత కుటుంబానికి పరామర్శ**

ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతిచెందిన వెంకటనర్సు కుటుంబాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, నగర మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణవరదరాజేశ్వర్‌రావు పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట కౌన్సిలర్ సమ్మెట సుధీర్, అప్సర్, కుమారస్వామి, అబ్బిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారమే మహాజన సోషలిస్టు పార్టీ లక్ష్యం

**• ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు ప్రణయదీప్**



ఎంఎస్‌పి జెండాను నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు

నర్సంపేట, జనవరి 4 : బడుగులకు రాజ్యాధికారమే మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పి) లక్ష్యమని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్ అన్నారు. పట్టణంలో ఎంఎస్‌పి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంఎస్‌పి నియోజకవర్గ కో-ఇంచార్జి తడుగుల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రణయదీప్ మాట్లాడుతూ వికలాంగులు, మహిళలు, అగ్రకుల పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం చేయాలన్న లక్ష్యంతో దండోర దళపతి మందకృష్ణ మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు ఆర్థిక, సామాజిక, రాజకీయన్యాయం, వారి హక్కుల కోసం మంద కృష్ణమాదిగ గత 29 ఏళ్ళుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాలు కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. గత నవంబర్ 11న హైదరాబాద్‌లో జరిగిన విశ్వరూప మహాసభలో ఎస్సీ వర్గీకరణ కోసం కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అణగారిన వర్గాల ప్రజల కోసం ఎంఎస్‌పి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మహాజన మహిళా సంఘం అధ్యక్షురాలు గుంపుల మాలతిలత, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాబు రాజుయాదవ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు, దామెర సుధాకర్, సాయికుమార్, గౌటోయిన కత్తిరాములు, రాజు, జి.సరోజన తదితరులు పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా మండల ప్రజా పరిషత్

**• ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది**

**• పట్టించుకోని ఉన్నతాధికారులు**





వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయం



కార్యాలయంలో అటెండర్లు, అధికారుల ముచ్చట్లు

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట, జనవరి 4 : గ్రామీణ ప్రాంతాల స్థానిక స్వపరిపాలన వ్యవస్థలో ముఖ్య భూమిక పోషించే వర్ధన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు ఎందుకు వస్తున్నారో, ఎందుకు వెళ్తున్నారో కూడా తెలియకుండాపోయిందని ప్రజల పేర్కొంటున్నారు. జిల్లా పరిషత్, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను వినియోగిస్తూ వాటి అభివృద్ధిలో గ్రామాల మధ్య సమన్వయం చేసే ప్రజాపరిషత్ పాలన పట్టాలు తప్పడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నారు. అధికారుల్లో సమన్వయ లోపం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు సంవత్సరాలుగా వర్ధన్నపేటలో పని చేస్తున్న ఓ అధికారి తీరుపై సర్వత్రా చర్చనీయాంశ మైంది. కొందరు అటెండర్లు 15 ఏళ్లుగా పాతుకు పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

**• సమయపాలన ఉండదు...**

వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు సమయపాలన పాటించడం లేదు. కొందరు అటెండర్లు ఉదయం 11గంటల వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉన్నతాధికారి కార్యాలయాన్ని పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనే చర్చసాగుతోంది. సదరు అధికారి ఫీల్డ్ మీద ఉన్నానంటూ కార్యాలయానికి రాకపోవడంపై పలువురు మండిపడుతున్నారు.

**• అటెండర్లదే హవా...**

ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు అటెండర్ల హవా సాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయంలో పనిచేస్తుండడంతో అధికారులు సైతం వీరికి ఎదురు చెప్పడం లేదని తెలుస్తోంది. సూపరింటెండెంట్ ఓ అటెండర్‌ను పనిచేయడం లేదని మందలించడంతో అతనితో తీవ్ర వాగ్వాదానికి దిగినట్లు ప్రచారం సాగుతోంది. ఆపై ఎంపీడీవోకు లేనిపోనివి చెప్పడంతో ఎంపీడీవో సూపరింటెండెంట్‌పై ఇష్టానుసారంగా మాట్లాడినట్లు సమాచారం. దీంతో కార్యాలయానికి రాకుండా డిప్యూటేషన్‌పై వెళ్లిపోయాడు. అధికారుల మధ్య సఖ్యత ఉండక పోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

ఓ అధికారి జిల్లాలో దాదాపుగా తొమ్మిదేళ్లుగా పని చేస్తోందని, నిబంధనల ప్రకారం ఒకే జిల్లాలో ఇన్ని సంవత్సరాలు పనిచేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తనకున్న పలుకుబడితో ఒకే జిల్లాలో ఉంటున్నట్టు తెలుస్తోంది. కింది స్థాయి సిబ్బందిని వేధిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. వేధింపులు తట్టుకోలేక సూపరింటెండెంట్ కొన్ని రోజులు సెలవుల్లో వెళ్లి, అటునుంచే డిప్యూటేషన్ వేసుకోగా ఇతర మండలాలకు పోనివ్వకుండా అడ్డుకున్నట్టు తెలుస్తోంది.

**• ఉపాధి నిధుల్లో చేతివాటం...**

గ్రామాల్లో ఉపాధి హామీ నిధుల నుంచి చేసే పనుల బిల్లుల చెల్లింపులో చేతివాటం ప్రదర్శిస్తున్నట్లుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. ఎన్నికల ముందు కట్య్రాలలో ఉపాధి హామీ నిధులు కొంత మంది ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు చెల్లింపులు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. వారి బ్యాంకు అకౌంట్‌లలో డబ్బులు జమ కావడంతో పలువురు అధికారులను నిలదీశారు. ఇవే కాకుండా సీసీ రోడ్డు పనులు, నర్సరీల్లో మట్టి పోయడం, నీరు పోయడం, వివిధ నిధుల విడుదలలో అవినీతి జరిగిందని, పని చేయకున్నా కొంత మంది పేర్ల మీద బిల్లులు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తాం



లింగాపురంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే



అలంకానిపేటలో మాట్లాడుతున్న జేడీఏ ఉషాదయాల్

**• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

చెన్నారావుపేట, జనవరి 4 : పార్టీలకు అతీతంగా సంక్షేమపథకాలను అందిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లింగాపురంలో ప్రజా పాలనలో భాగంగా అభయ హస్తం దరఖాస్తుల ఫారమ్‌లను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీ పథకాలు ప్రతీ ఒక్కరికి అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు. వైద్య సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, సర్పంచ్ తప్పెట రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మంచిక కుమారస్వామి, మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రజలందరికీ అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని శనిగరం, రేలకుంట, లెంకాలపెల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. అయితే శనిగరం, రేలకుంట గ్రామ సభలకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బొనగాని రాజేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కూచన ప్రకాష్, సర్పంచ్‌లు డ్యాగల మల్లికాంబ, సిద్ధారి రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సరస్వతి, జ్యోతి, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, మాలోతు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతీ గడపకు అందిస్తామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఖానాపురం, ధర్మరావుపేట పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తుల నుంచి దరఖాస్తులను అందుకున్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శాఖమూరి చిరంజీవిహరిబాబు, వెన్ను శృతి, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమనవాణి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎంపీటీసీ బల్గూరి విజాకర్‌రావు పాల్గొన్నారు.

• దుగ్గొండి: ప్రజలకు అందుబాటులో ఉండి సేవకుడిగా పని చేస్తానని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురంలో గురువారం సర్పంచ్ ఇంగోలి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో ఎమ్మెల్యే మాధవరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమం లో ఎంపీటీసీ విజయ, మండల ప్రత్యేక అధికారి శ్రీని వాసరావు, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, పొగాకు వెంకటేశ్వర్లు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**• అర్హులందరూ దరఖాస్తులు చేసుకొండి**

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిని పొందడానికి అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని నెక్కొండ మండల ప్రత్యేకాధికారి, జేడీఏ ఉషాదయాల్ అన్నారు.

మండలంలోని అలం కానిపేట, చంద్రుగొండ, నాగారం గ్రామాల్లో గురువారం ప్రజాపాలన సభలను నిర్వహించారు.ఈ సభలో టీ లీడర్లు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో పర్వీన్, ఏవో నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాదాసు అనంతలక్ష్మీరవి, బక్కి రాజమ్మ, సుదర్శన్ పాల్గొన్నారు.

**• ఆట పాటలతో సంక్షేమ పథకాల ప్రచారం**

చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సంస్కృతిక సారథి నెల్లుట్ల సుమన్ ఆధ్వర్యంలో ఆట పాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆట పాటలతో ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తప్పెట రమేష్, తహశీల్దార్ ఫణి కుమార్, కళాబృందం తాళ్ల సునిల్, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగెల రవిందర్, యోచన, తదితరులు పాల్గొన్నారు.

**• కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ**

వర్ధన్నపేట రూరల్: మండలంలోని ల్యాబర్తిలో గురువారం నిర్వహించిన గ్రామసభలో అభయహస్తం పథకాలకు ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎంపీడీవో రాజ్యలక్ష్మి, సర్పంచ్ పస్తం రాజులు వాటిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నర్సంపేట, టౌన్, జనవరి 4: పనితీరును బట్టి పని చేసినచోట గుర్తింపు లభిస్తుందని, బదిలీ సమయంలో గుర్తుకు చేసుకోవడం జరుగుతుందని జడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం జి.శ్రీనివాస్, గణిత ఉపాధ్యాయుడు ఎ.మనోహర్‌లను గురువారం జడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్‌రెడ్డి, సర్పంచ్ వలుగుపల్లి రంగారెడ్డి, ఎంపీటీసీ వలుగుబెల్లి విజయప్రతాప్‌రెడ్డి, ఉపసర్పంచ్ మిట్టగడపల తిరుపతి, ఎస్‌ఎంసీ చైర్మన్ గడ్డం చెన్నయ్యలు ఘనంగా సన్మానం చేశారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జడ్పీటీసీ, సర్పంచ్

జడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సేవ చేయడంలో ఉపాధ్యాయుల పని తీరును గ్రామస్థులు, విద్యార్థులు కొనియాడడంతోనే వారి పని తీరుకు నిదర్శనమన్నారు. విద్యార్థులు ప్రతిభచాటి ట్రిబుల్ ఐటీ, ఇతర పోటీ పరీక్షలకు వెళ్లడం అభినందనీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, పీఎస్ హెచ్‌ఎం సర్దార్, దాసరిపల్లి హెచ్‌ఎం శోభన్ బాబు, ఉపాధ్యాయులు సారంగపాణీ, దార గణేష్, మురళీధర్, జ్యోతి, వెంకన్న, అరుణా, వాణీ, జగన్ మోహన్. వసంతరాణీ, లకపతి, రమాదేవి, అంగన్ వాడీ టీచర్ లలిత పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు





నిందితుని అరెస్టు చూపిస్తున్న ఏసీపీ

పర్వతగిరి, జనవరి 4 : మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పా ల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. గురువారం పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ముంజాలకుంట తండాకు చెందిన మహిళకు ఐదేళ్ల క్రితం కేసముద్రం మండలంలోని కోమటిపల్లి తండాకు చెందిన బాదావత్ మోహన్‌తో వివాహం అ య్యింది. ఇద్దరికి ఒక బాబు జన్మించిన అనంతరం గొడవల కారణంగా విడాకులు తీసుకుని వేర్వేరుగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో మహిళ హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వెళ్లగా అక్కడ నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లికి చెందిన కణుకుల యాకూబ్‌రెడ్డితో పరిచయం ఏర్పడి చనువుగా ఉండేవారు.

అనంతరం వీరిద్దరి మధ్య కూడా గొడవలు జరగడంతో అతడితో మాట్లాడడం మానేసి తల్లిగారి ఊరైన ముంజాలకుంట తండాకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో గత డిసెంబరు 31వ తేదీన యాకూబ్‌రెడ్డి తండాకు వచ్చి ఆమెతో గొడవపడి విచక్షణారహితంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి బాబాయ్ బానోత్ మిట్టు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో పర్వతగిరి సీఐ శ్రీనివాస్, ఎస్సై వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజల మధ్యలోనే ఉంటా

**• మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్

పర్వతగిరి, జనవరి 4 : ఎన్నికల్లో ఓటమిపాలైనా అధైర్యపడకుండా నియోజకవర్గ ప్రజల మధ్యలోనే ఉంటానని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 సంవత్సరంలో నియోజకవర్గ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశానని, 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వస్తున్నానని అన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటున్నానని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం దిశగా కృషిచేస్తానన్నారు. ఎన్నికల్లో గెలుపోటము లు సహజమని, ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. ఎన్నికల్లో తన గెలుపుకోసం కృషిచేసిన ప్రతీ ఒక్కరికి పాదాభివందనం చేస్తున్నానని, రాబోయే ప్రతీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రంగు కుమార్, కో ఆప్షన్ మెంబర్ సర్వర్, ఎంపీపీ కమలపంతులు, సొసైటీ చైర్మన్ మనోజ్‌గౌడ్, దేవేందర్, వైస్ ఎంపీపీ రాజేశ్వర్‌రావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, నాయకులు భాస్కర్‌రావు, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు

వర్ధన్నపేట, జనవరి 4 :పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆవిష్కరించారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులు పక్షపాతిగా పనిచేస్తుదని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మండలశాఖ అధ్యక్షుడు తాటిపాముల రమేశ్, రాపాక సదానందం, అనిల్, అశోక్, మనుజేందర్‌రెడ్డి, కుమారస్వామి, ధనలక్ష్మీ, సునీత, వాణి, కల్యాణి పాల్గొన్నారు.

అలాగే వర్ధన్నపేట మండల పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ యూత్ అధ్యక్షుడు కొండేటి శ్రీకాంత్, జట్టి కృష్ణంరాజు, కొండేటి రోహిత్, కొండేటి భార్గవ్, బొక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 8న నెక్కొండ మండల సభ

నెక్కొండ, జనవరి 4 : ఈ నెల 8న నెక్కొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీపీ జాటోతు రమేశ్ గురువారం తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభకు హాజరై, మండలంలో జరుగాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించాల్సిందిగా ఆయన కోరారు.

## షూటింగ్ బాల్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు



విద్యార్థి కార్తిక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి



పల్లవి



బిందు

చెన్నారావుపేట, జనవరి 4 : మండలంలోని అమీనాబాద్ మోడల్ పాఠశాలలో చదువుతున్న కార్తీక్ విద్యార్థుల జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి బుధవారం తెలిపారు. అలాగే కస్తూర్బా గురుకులానికి చెందిన బిందు, ఎ.పల్లవిలకు ఇటీవల తొర్రూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజయవాడలో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగే సౌత్ జోన్ నేషనల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తీక్‌ను పలువురు ఉపాధ్యాయలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ యూత్ డివిజన్ కన్వీనర్ రాజ్‌కుమార్ జన్మదిన వేడుకలు



గిర్నిబావిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

దుగ్గొండి, జనవరి 4 : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ డివిజన్ కన్వీనర్, రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శానబోయిన రాజ్ కుమార్ జన్మదిన వేడుకలను గిర్నిబావిలో గురువారం ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తాడు మండల గౌరవ సలహాదారుడు, తిమ్మంపేట సర్పంచ్ మోడెం విద్యాసాగర్, మందపల్లి సొసైటీ చైర్మన్ గుడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ సింగతి కార్తిక్, ఎంపీటీసీ విజయమోహన్‌రావు, అంబీరు రమేశ్, పొగాకు బాలకృష్ణ, కందిపెల్లి శంకర్, నాగరబోయిన కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆల్‌ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

రాయపర్తి, జనవరి 4 : మండలంలోని పెర్కవేడులో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ వారి ఆధ్వర్యంలో సర్పంచ్ తారాశ్రీ రాజబాబు ఆల్‌ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపేలా వారికి సహకరించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ సుజన్ తేజ, ఎస్‌ఎంసీ చైర్మన్ సుధాకర్, ఎంపీటీసీ బండి అనూష రాజబాబు, ఉపాధ్యాయులు ప్రమోద్, వెంకటేశ్వర్లు, రాజు, రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి పాటుపడాలి

దుగ్గొండి, జనవరి 4 : మత్స్యకారుల అభివృద్ధికై కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సహకారంతో ఏర్పాటైన మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. మండలంలోని గిర్నిబావిలో పాక్స్ సొసైటీ అవరణలో కేంద్ర ప్రభుత్వ (ఎస్ఎఫ్‌ఏసీ) సహకారంతో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం మత్స్యకార సొసైటీలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న పిట్టల రవీందర్ మాట్లాడుతూ మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘాల పాలకవర్గం పని తీరుతో దళారీ వ్యవస్థ నియంత్రించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రాయితీలు, వ్యవసాయ ఉత్పత్తులకై మార్కెటింగ్ సౌకర్యం నాణ్యమైన విత్తనాలు ఎరువుల వంటి సౌకర్యాలు కల్పించబడుతాయన్నారు. మత్స్యకారులు సంఘాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ సంస్థ ప్రతినిధి మూగ జయశ్రీ , జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమన్న, మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, నారదాసు, ఈశ్వర్, వినోద్‌కుమార్, ఫిషరీస్ ఆఫీసర్ విల్సన్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.